అంగన్‌వాడీలకు అందని పుస్తకాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల భవితను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలను పునః ప్రారంభించి నెలలు గడుస్తున్నా పాఠ్యపుస్తకాలు సరఫరా చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా పాత పుస్తకాలతోనే బోధనను కొన సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

- పాత పుస్తకాలతో నెట్టుకొస్తున్న వైనం
- కేంద్రాలపై కూటమి ప్రభుత్వం ఉదాసీనత
- గత ప్రభుత్వ పాలనలో సత్ఫలితాలు


అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ సీడీపీఓ పరిధిలో 227 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాలకు నిత్యం 9,344 మంది చిన్నారుల వరకు వస్తున్నారు. ఇందులో మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 5వేల మంది ఉంటున్నారు. బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల విషయంలో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయి. ఈ కేంద్రాల చిన్నారులకు ఆటపాటలతో కూడిన నాలుగు పుస్తకాలను బర్డ్స్-1, కిట్లను అందజేసింది. వీటి వల్ల ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు ఏమాత్రమూ తగ్గకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఇంగ్లిష్‌లో విద్యాబోధన చేసేవారు. ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రెండు నుంచి నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ డ్రాయింగ్స్ సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన అంగన్‌వాడీ చిన్నారులకు పాఠాలు చెబుతున్న టీచర్ (ఫైల్) పీపీ-1 కిట్లు , నాలుగేళ్ల నుంచి ఐదేళ్ల చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లను అందజేసింది. ఇవన్నీ మంచి ఫలితాలు ఇచ్చాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణలకు మంగళం పాడింది. అంగన్‌వాడీ కేంద్రాలకు పాఠ్య పుస్తకాల పంపిణీని పూర్తిగా నిలిపివేసింది.

పాతపుస్తకాలతో...

కొంతమంది అంగన్‌వాడీ వర్కర్లు పాత పుస్తకాలతో బోధన కొనసాగిస్తున్నారు. చిన్నారులకు ఆయా పుస్తకాల్లోని బొమ్మలను చూపించి అర్థమయ్యే విధంగా వివరిస్తుంటే వారికి చక్కని విషయ పరిజ్ఞానం పెంపొందించేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పుస్తకాల పంపిణీ ఆగిపోయి తమ చిన్నారుల భవితకు అవరోధంగా మారిందని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రైవేటుకు ఊతం

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను పరోక్షంగా ప్రోత్సహించేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిర్వహించే ప్రీ స్కూల్లో చేరిన విద్యార్థులు ఆ తర్వాత ఆ విద్యాసంస్థల్లో కొనసాగుతుంటారు. చిన్నారులను అలవాటు చేసేందుకు ప్రీ స్కూల్లో చేరుస్తుంటారు. అంగన్‌వాడీ కేంద్రాలకు బలోపేతానికి ప్రభుత్వం ఊతమిచ్చే చర్యలకు స్వస్తి పలికితే తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రైవేట్ విద్యాసంస్థల్లో చేర్పించడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

పుస్తకాలు త్వరలో వస్తాయి

పుస్తకాలు త్వరలో వస్తాయని రాష్ట్రస్థాయి అధికారులు చెప్పారు. పుస్తకాలు వచ్చిన తర్వాత వాటిని పంపిణీ చేస్తాం. ప్రస్తుతం అంగన్‌వాడీ వర్కర్లు పాత పుస్తకాలతో విద్యాబోధన చేస్తున్నారు. బోధనకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. త్వరలోనే ఆయా సమస్యలు పరిష్కారమవుతాయి. చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

-శ్యామ్ సుగుణకుమారి, సీడీపీఓ, చిత్తూరు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఐరాల విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో పీడీ దేవా

ఐరాల: స్థానిక ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్-14 ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలకు ఎంపికయ్యారని ఆ స్కూల్‌ హెచ్‌ఎం కోమల తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, ఇటీవల చిత్తూరు మెసానిక్ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-14 ఫెన్సింగ్ పోటీల్లో బాలికల విభాగంలో తమ స్కూల్ విద్యార్థిని గాయత్రి, బాలుర విభాగంలో పవన్ విశేష ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరిద్దరూ నంద్యాలలో ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్ దేవాను ఎస్‌ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న నియోజకవర్గ నోడల్ అధికారి బాబు రాజేంద్రప్రసాద్

ఐరాల: 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పూతలపట్టు నియోజకవర్గ నోడల్ అధికారి బాబు రాజేంద్రప్రసాద్ కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, దేశ భవిష్యత్తుకు యువతే కీలకమన్నారు. ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములు కావాలన్నారు. ఓటరుగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలోనూ నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ ఆపరేటర్ దుర్గ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన


ఎమ్మెల్యేకు సమస్యలు నీవా నది పరీవాహక ప్రాంత ప్రజలు


చిత్తూరు అర్బన్: నగరంలోని నీవా నది పరీవాహక ప్రాంతాలైన తేనెబండ, తేనెబండ రోడ్డు, వీరభద్ర కాలనీ, వీరభద్ర ఆలయం, సంతపేట లిల్లీ బ్రిడ్జి, మీ-సేవ రోడ్డు, కట్టమంచి రిక్షాకాలనీలో మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పర్యటించారు. నీవా నదిపై ఉన్న పలు కల్వర్టులు, వంతెనలను పరిశీలించారు. నదిలో చేస్తున్న పూడికతీత పనులను పరిశీలించారు. నది పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు.

కుప్పిగానిపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: మండలంలోని కుప్పిగానిపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రష్మిత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శిల్ప, సరళ, సరిత, శివగామి, కిరణ్ కుమారి పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీ లెక్కింపు


సత్యగంగమ్మ ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

పలమనేరు: పట్టణంలోని పాతపేట టీకే వీధిలో వెలసిన సత్యగంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు స్థానిక ఆలయంలో మంగళవారం జరిగింది. లెక్కింపులో రూ.1.21లక్షల నగదు, 5 గ్రాముల బంగారం, స్థానిక శివాలయంలో రూ.2.20లక్షల నగదు భక్తులు కానుకలుగా వేసినట్లు ఆలయాల ఈఓ కమలాకర్ తెలిపారు. లెక్కింపులో అర్చకులు, పట్టణ పెద్దలు పాల్గొన్నారు.

బహుదా నదికి పూజలు


వర్షానికి కాణిపాకం సమీపంలోని బహుదానదిలో వరద ప్రవాహం మొదలైంది. దీంతో ఆలయ అర్చకులు పూజలు చేశారు. ముందుగా ఆలయం నుంచి గంగమ్మకు పట్టువస్త్రాలు, పూజాసామగ్రిని మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం పూజలు చేసి గంగమ్మకు హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ గురుప్రసాద్, ఏఈఓలు పాల్గొన్నారు.

- కాణిపాకం

పిల్లల గణన సర్వే ప్రారంభం


మాట్లాడుతున్న డీఐఓ హనుమంతరావు

చిత్తూరు రూరల్: ప్రభుత్వం పిల్లల గణన సర్వే ప్రారంభించిందని డీఐఓ హనుమంతరావు చెప్పారు. మంగళవారం చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ఐదేళ్లలోపు, 5 నుంచి10 ఏళ్ల పిల్లల గణన సర్వేకు మంగళవారం నుంచి శ్రీకారం చుట్టిందన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు క్షేత్రస్థాయిలో ఈ సర్వేను చేస్తారన్నారు. పిల్లలు ఎంత మంది ఉన్నారు? పుట్టిన వారిలో ఎవరైనా మరణించారా? బతుకుదెరువు కోసం వలస వచ్చిన కుటుంబంలో ఎవరైనా పిల్లలున్నారా? బయట రాష్ట్రాల నుంచి ఎంత మంది పిల్లలు వచ్చారు? జిల్లా నుంచి ఎంత మంది పిల్లలు బయట ప్రాంతాలకు వెళ్లిపోయారు? అనే అంశాలపై సర్వే చేస్తారని వివరించారు. ఈ సర్వే ఆధారంగా వారందరికీ సకాలంలో టీకాలు వేయించారా, లేదా? అనేది తెలుస్తుందన్నారు. దీని ఆధారంగా త్వరలో ప్రారంభమయ్యే మిషన్ ఇంద్ర ధనస్సులో టీకా తప్పిన పిల్లలకు వాటిని వేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య సిబ్బంది విధిగా నవంబర్ 10వ తేదీలోపు సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: పౌష్టికాహారంతోనే గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం వీఎస్.అగ్రహారంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రతి నెలా 9న గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, గర్భిణులు క్రమం తప్పకుండా థైరాయిడ్, బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పిల్లలు జ్వరం బారిన పడితే డాక్టర్‌ను సంప్రదించి రక్త పరీక్షలు చేయించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చిత్తూరు ఈఓపీఆర్డీగా పరశురాం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండల ఈఓపీఆర్డీగా పరశురాం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓపీఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్ కలికిరి మండలానికి బదిలీ అయ్యారు. అక్కడ నుంచి పరశురాం చిత్తూరుకు బదిలీపై వచ్చారు. పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

టపాసుల దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థలపరిశీలన చేస్తున్న తహసీల్దార్, ఎస్సై

ఐరాల: దీపావళి పర్వదినం సందర్భంగా తాత్కాలిక టపాసుల దుకాణాల ఏర్పాటు నిమిత్తం మంగళవారం రెడ్డివారిపల్లె సమీపంలోని మార్కెట్ యార్డును తహసీల్దార్ మహేష్‌కుమార్, ఎస్ఐ నరసింహులుతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. టపాసులు కొనుగోలు చేయడానికి వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఎస్ఐతో చర్చించారు. కార్యక్రమంలో వీఆర్ఓ రాధయ్య పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు వీడ్కోలు సన్మానం


బదిలీ ఉద్యోగులను సన్మానించిన ప్రజాప్రతినిధులు

పూతలపట్టు: బదిలీపై వెళ్లిన పూతలపట్టు పంచాయతీ కార్యదర్శులు వలీఖాన్, గౌతమి, వీఆర్వో రాజగోపాల్‌కు సర్పంచ్ మాసిలామని, ఉపసర్పంచ్ బాబురెడ్డి వీడ్కోలు సన్మానం చేశారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో పంచాయతీ ప్రజలకు అధికారుల ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. కో-ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, వైఎస్సార్ సీపీ నాయకులు షణ్ముగం, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు


గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

గుడిపాల: సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముట్టుకూరుపల్లెలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గతంలో జరిగిన రీ-సర్వేలో ఏమైనా తప్పిదాలు చోటు చేసుకుని ఉన్నపక్షంలో వాటిని సరిచేసేందుకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రైతులకు రీసర్వే చేసిన రికార్డులను ఇచ్చామని, ఇంకనూ ఏమైనా సమస్యలు ఉంటే అర్జీ రూపంలో తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడీఈగా అరుల్ కుమార్



తవణంపల్లె: పైపల్లె సబ్ డివిజనల్ ట్రాన్స్‌కో ఏడీఈగా అరుల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఈగా పని చేస్తున్న సుబ్రమణ్యం శ్రీకాళహస్తి రూరల్ ఏడీఈగా బదిలీపై వెళ్లారు. పుంగనూరు డివిజనల్ కార్యాలయంలో ఏఈ పని చేస్తూ అరుల్ కుమార్ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి ఏడీఈగా వచ్చారు. తమ పరిధిలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ ఇచ్చేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

వర్షార్పణం

- నేలకొరిగిన వరి పంట
- కూలిన ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు


టి.పుత్తూరు దగ్గర నేలకొరిగిన వరి పంట

తవణంపల్లె: తుపాను ప్రభావంతో మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలో సోమవారం రాత్రి 103 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. నాలుగు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. వర్షానికి కొత్తగొల్లపల్లె, ఉత్తర బ్రాహ్మణపల్లె, పల్లెచెరువు, టి.పుత్తూరు గ్రామాల వద్ద వరి పంట నేలకొరిగింది. మరోవైపు వంకలు, వాగులు ప్రవహించి చెరువులకు నీరు చేరింది. వర్షానికి మండలంలోని జి.గొల్లపల్లె, కొండ్రాజుకాలువ దగ్గర 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి, పలుచోట్ల కరెంటు స్తంభాలు కింద పడ్డాయి. దీనితో కరెంటు సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

జాతీయ రహదారే పశువుల పాక!


జాతీయ రహదారిపైనే మకాం వేసిన పశువులు

చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిపైనే పశువులు ఎంచక్కా పడకేసి సేదదీరుతున్నాయి. గుడిపాల నుంచి చిత్తూరుకు వెళ్లే మార్గమధ్యంలోని గంగాసాగరం వద్ద పశువులు రోడ్డు మీద మకాం వేయడం మూలాన తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారులపై పశువులు రాకూడదని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ కూడా కొంతమంది రోడ్లపైకి పశువులను వదిలేస్తున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో హఠాత్తుగా పశువులు కలబడి వాహనాలపైకి దూసుకురావడంతో ఓ కారు బాగా దెబ్బతింది. అలాగే ఓ పాడిఆవు కూడా తీవ్రంగా గాయపడింది. సంబంధిత అధికారులు రోడ్లపైకి పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- గుడిపాల

కుండపోత వర్షం


చెర్లోపల్లె పరిధిలోని నిండిన వెంకటప్పనాయుడు చెరువు

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో సోమవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో చెరువులు, కాలువలు జలకళను సంతరించుకుంటున్నాయి. చాలా చోట్ల కాలువలు, చెరువులు నిండి మొరవ పారుతున్నాయి. రోడ్లంతా జలమయమయ్యాయి. సాగులో ఉన్న పంటలు కూడా దెబ్బతిన్నాయి.


వర్షానికి నిండి పారుతున్న ఉత్తర బ్రాహ్మణ చెరువు చెక్‌డ్యామ్

సామూహిక సీమంతం


గర్భిణులకు సీమంతం చేయిస్తున్న వైద్యాధికారులు

గంగవరం: మండలంలోని మన్నార్‌నాయనిపల్లిలో గర్భిణులకు గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు సొంత ఖర్చులతో మంగళవారం సామూహిక సీమంతం చేయించారు. ఇప్పటివరకూ పీహెచ్‌సీ సిబ్బందికి మాత్రమే ఇలాంటి కార్యక్రమాలు చేసేవారు. అయితే పేద మహిళలను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమం చేయడం ఇదే మొదటిసారని ఆయన తెలిపారు. సీమంతపు సారె, అవసరమైన వస్తువులను గర్భిణులకు ఉచితంగా అందజేశారు. వైద్యాధికారి లహరి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గార్గేయకు జలకళ


మొరవ పోతున్న కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్ట్

సదుం: మండల సరిహద్దులోని సోమల మండల అటవీప్రాంతంలో కొద్దిరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి వరదనీరు కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టుకు చేరింది. ప్రాజెక్టు నిండడంతో మంగళవారం వేకువజాము నుంచి మొరవ పోతోంది. ఈనేపథ్యంలో గార్గేయ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీరు పాపిరెడ్డిగారిపల్లె ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు నిండడంతో గ్రామస్తులు గంగమ్మకు పూజలు చేసి జలహారతి ఇచ్చారు. కాగా వరద నీటి కారణంగా పలువురు రైతులకు చెందిన బోరు మోటార్లు, స్టార్టర్లు కొట్టుకుపోయినట్లు సమాచారం. పలు చోట్ల గార్గేయనది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్, ఎస్ఐ షేక్ షావలి పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద నీటిలో వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు.